ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | 5



అమలాపురం పంటకాల్వలో మళ్లీ మొసలి కలకలం - 7లో



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

'స్పందన'కు 260 అర్జీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'స్పందన'కు అర్జీదారులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు 260 అర్జీలు స్వీకరించారు. సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీపీవో వి.కృష్ణకుమారి, డీఎస్వో ఎ.పాపారావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మదన్‌మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నా భార్యను స్వదేశానికి రప్పించండి

బిడ్డలతో గాలి వీరవెంకటసుబ్రహ్మణ్యం, గోడి, అల్లవరం మండలం

నా భార్య మంగాదేవి ఉపాధి కోసం గత ఏడాది జూలై 26న గల్ఫ్‌లోని ఖతర్ దేశానికి వెళ్లింది. అక్కడ పనిచేయించుకుంటున్న యజమానులు జీతం ఇవ్వకుండా ఇబ్బందులకుగురి చేస్తున్నారు. దాంతో ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో మంగాదేవిని ఇండియన్ ఎంబసీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పని చేయించుకుని జీతం ఇవ్వకుండా వేధింపులకు గురి చేయడం వల్లే ఇంటి నుంచి బయటకు వచ్చిందని, ఎన్నో ఇబ్బందులు పడుతున్న నా భార్యను ఇండియాకు తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.



ఇళ్ల స్థల పట్టా అందించి ఆదుకోండి

భార్యతో కలిసి అర్జీ అందించేందుకు వచ్చిన రాయుడు పల్లంశెట్టి, మడుపల్లి, అయినవిల్లి మండలం

గత ఏడాది బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. కనీసం దివ్యాంగ పెన్షన్ కూడా రావట్లేదు. గతంలో ఇళ్ల స్థల పట్టా ఇచ్చారు. కొత్తగా పట్టా ఇస్తామంటూ ఆ పట్టాను రద్దు చేశారు. ఏళ్లు గడిచిపోతున్నా ఇళ్లస్థల పట్టా మాత్రం ఇవ్వడం లేదు. అధికారుల చుట్టూ తిరుగున్నా పట్టించుకోవట్లేదు.



పేరు చూపిస్తుంది.. స్థలం చూపించరు

పెమ్మాడి దుర్గాభవానీ, బోడసకుర్రు

ఇళ్ల స్థలం కోసం సచివాలయం స్థాయి నుంచి కలెక్టరేట్‌లోని స్పందన వరకు అర్జీలు అందించాను. ఆన్‌లైన్‌లో పేరు చూపిస్తోంది అని చెప్తున్నా ఇళ్ల స్థలం మాత్రం చూపించడం లేదు. సంవత్సరం నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఇళ్ల స్థల పట్టా ఇచ్చి ఆదుకోండి.

పందుల స్వైరవిహారంతో బతకలేకపోతున్నాం



ఐ.పోలవరం మండలం కొమరగిరి పంచాయతీ వీధిలో దశాబ్దాల కాలంగా నివసిస్తున్న ఇళ్ల మధ్యలో ఓ వ్యక్తి పందుల పెంపకం చేపట్టాడు. పందులు ఇళ్లల్లో తిరుగుతూ స్వైరవిహారం చేస్తున్నాయి. 70 కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదు. రోగాలతో బతుకులు దుర్భరంగా సాగిస్తున్నాం. పందుల పెంపకాన్ని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడండి అంటూ గ్రామస్తులు గంజా సురేష్, తోట పద్మావతి, గంజా శ్రీను, తోట వెంకటలక్ష్మి, దొంగ గనికమ్మ, గంజా మరిడయ్య తదితరులు పిల్లలతో కలిసి నిరసన తెలిపారు.

ఎస్పీ స్పందనలో 31 అర్జీలు



ఎస్పీ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న బలరామమూర్తి తదితరులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో 31 అర్జీలను స్వీకరించారు. కోకోఫెడ్ తరఫున చైర్మన్ అరిగెల బలరామమూర్తి ఆధ్వర్యంలో ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. పేరూరు వై.జంక్షన్ వద్ద క్రాస్ రోడ్‌లో జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవలి కాలంలో పలువురు మృతి చెందారన్నారు. వాటితో పాటు బైపాస్‌ను ఆనుకుని ఉన్న వంతెనలవద్ద సైతం ఇదే తరహాలో ప్రమాదాలు జరుగుతున్నాయని వినతిపత్రంలో వివరించారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరగా తగు చర్యల కోసం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్‌కు తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యదర్శి ఆదిత్యకిరణ్, బీవీవీ సత్యనారాయణ, నాగాబత్తుల నరసింహమూర్తి, మొయిల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మెర్లపాలెం-ఊబలంక మధ్యలో లంక మట్టిని కొల్లగొడుతున్న దృశ్యం



బొండు మట్టిని లారీలో తరలిస్తున్న దృశ్యం

- ఇసుక రీచ్‌ల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- ఇళ్ల స్థలాల మెరకకు లంక మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రతిమా కంపెనీకి కాసుల పంట... స్థానికులకు దుమ్ము ధూళి... అధికార పార్టీ నేతలకు కరెన్సీ వర్షం... అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నా మామూళ్ల మత్తులో పట్టించుకోని అధికారులు... వెరసి మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.



వాడపల్లిలో స్థలాన్ని మెరక చేస్తున్న దృశ్యం

లంక మట్టి కొల్లగొట్టి!

ఆత్రేయపురం, ఫిబ్రవరి 5: కొత్తపేట నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ గత ఏడాది జూన్ 2న అనుమతి పొందింది. ఆ కంపెనీ ఆగడాలతో స్థానికుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ఇసుక, బొండుమట్టి అక్రమ తవ్వకాలతో నిర్వాహకులు నోట్లు దండుకుంటున్నారు. రీచ్‌ల్లో తవ్వకాలను పర్యవేక్షించేందుకు మైనింగ్, సెబ్, హెడ్‌వర్క్స్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, భూగర్భ జలవనరుల శాఖల అధికారులతో కూడిన జిల్లా ఇసుక కమిటీ ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రావులపాలెం మండలం ఊబలంకలో తవ్వకాలకు అనుమతి పొందిన ప్రతిమా కంపెనీ సరిహద్దు దాటి ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలోకి చొరబడి ఇసుక తవ్వేస్తోంది. ఊబలంక పరిధిలోని లంకలను కొల్లగొట్టితద్వారా వచ్చిన బొండు మట్టితో ఆత్రేయపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రైవేటు స్థలాలను మెరక చేస్తున్నారు. నిత్యం వందలాది లారీల్లో బొండు మట్టి అక్రమంగా తరలిపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. అలాగే వశిష్ఠ, గౌతమి గోదావరి నదుల్లో రాత్రివేళల్లో ఇసుక, లంక మట్టి తవ్వకాలను విచ్చలవిడిగా చేస్తున్నారు. బొబ్బర్లంక, వెలిచేరు, పులిదిండి, కట్టుంగ, వద్దిపర్రు తదితర గ్రామాల్లో ఈ దందా కొనసాగుతోంది. కన్సర్వెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తూ లంకల్లో అక్రమంగా మట్టి తవ్వుతూ ఇళ్ల స్థలాలను మెరక చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. జిల్లా సాండ్ కమిటీ ఇసుకాసురుల అక్రమాలపై కొరడా ఝుళిపించి లంకలను కాపాడడంతో పాటు అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై మెర్లపాలెం సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి వివిధ శాఖల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రీచ్‌లను పరిశీలించి వెళ్లారే తప్ప ఎటువంటి చర్యలూ చేపట్టలేదు.





కామనగరువు సచివాలయం వద్ద మందకొడిగా సాగుతున్న ఇళ్లస్థల పట్టాల రిజిస్ట్రేషన్లు, పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

సర్వర్ డౌన్.... నత్తనడకన రిజిస్ట్రేషన్లు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 5: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సచివాలయాల్లో ప్రారంభించారు. అధికారులు ఇచ్చిన లక్ష్యాలను చేరుకునేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్లు మొరాయించడంతో కొన్ని సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు నుంచి పదేసి చొప్పున మాత్రమే రిజిస్ట్రేషన్లు చేయగలుగుతున్నారు. లబ్ధిదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సచివాలయాల్లో పడిగాపులు పడుతున్నారు. కామనగరువు-1 సచివాలయంలో జరుగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. సాంకేతిక సమస్యలతో పాటు సర్వర్ డౌన్ కావడం, ఒకే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టడంతో లబ్ధిదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా సచివాలయాల్లో పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు చేస్తున్న విధానాన్ని ఆర్డీవో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు అడపా సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి ఏఎస్‌వీఎస్ రాజేశ్వరరావు (రాజా), పరంశెట్టి ఆదినారాయణ, వీఆర్వో వల్లీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ భూములు, భవనాల రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు. రిజిస్ట్రేషన్లు నామమాత్రంగానే జరిగాయి. సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు.



కామనగరువులో రిజిస్ట్రేషన్ల కోసం ఉదయం నుంచి నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

రైల్వే లైన భూసేకరణ నిలుపుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట గుడిమెళ్లంక గ్రామస్తుల ధర్నా



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5: కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ప్రతిపాదిత భూసేకరణ వల్ల గ్రామంలోని ప్రధాన వనరులు పూర్తిగా నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామస్తులు ధర్నా చేశారు. సర్వే నెం.308/1లో 11.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రధాన మంచినీటి చెరువు మధ్యలోంచి రైల్వేలైన్ వెళ్లడం వల్ల వేలాది మంది ప్రజలతో పాటు పశుపక్ష్యాదులకు నీటి సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలో ఆక్వా సాగు విస్తరించి ఉండడంతో మంచినీటి బావులన్నీ ఇప్పటికే ఉప్పునీటి బావులుగా మారిపోయాయన్నారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు తాగునీరు సరఫరా చేసే విధంగా ఆ ప్రాంతంలో ఓహెచ్ఎస్సార్‌తో పాటు నీటి సంపు నిర్మించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలజీవన్‌మిషన్‌లో మంచినీటి చెరువును అధునాతన సాంకేతిక విధానంలో అభివృద్ధిపరిచేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. రైల్వేలైన్ నిర్మాణం వల్ల దాతల సహకారంతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రంతో పాటు ఎన్నో గృహాలను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తరతరాలుగా ఇదే మంచినీటి చెరువులో హైందవ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించడంతో పాటు ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవాలు జరుగుతాయని వివరించారు. గతంలో ప్రతిపాదించిన రైల్వేలైన్‌ను పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ హిమాన్షు శుక్లాకు గ్రామస్తులంతా వినతిపత్రం అందజేశారు. భూసేకరణ నుంచి ప్రధాన మంచినీటి చెరువుకు మినహాయింపునివ్వాలని అభ్యర్థించారు. వినతిపత్రం అందించిన వారిలో సర్పంచ్ నల్లి విజయకుమారి, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, మాజీ సర్పంచ్ కలగత ఏసురత్నం, గ్రామ పెద్దలు పెన్మెత్స రంగరాజు, గవర్రాజు, బత్తుల ప్రసాద్, కంకటాల శ్రీనివాస్, కొణిదెల అన్నవరం, తోట శ్రీనివాస్, సలాది బ్రహ్మం, అల్లూరి మహేష్‌రాజు, పెన్మెత్స చిట్టిబాబు, కంకటాలచిట్టిబాబు వున్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 5: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండు చేస్తూ ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులంతా అక్కడకు చేరుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వహణ పథకంలో కార్మికులతో గత ఇరవై ఏళ్లుగా వెట్టి చాకిరీ చేయించుకుంటూ చాలీచాలని వేతనాలు ఇస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే రూ.10వేలు వేతనం అమలు చేస్తామని పాదయాత్ర సమయంలో జగన్ హామీ ఇచ్చినా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. నెలకు రూ.3వేలు మాత్రమే ఇస్తున్నారని, దాంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. నాడు-నేడు పనుల్లోనూ తమతో పనులు చేయించుకుంటున్నారన్నారు. వంటశాలలు లేక ఎండకు, వర్షాలకు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు కనీసం రూ.20 పెంచాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా వర్తింపజేయాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, వంట చేసేటప్పుడు ప్రమాదానికి గురైన కార్మికులకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని, రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, వర్కర్లు, ఎంఈవోలతో రెండు నెలలకోసారి సమావేశాలు నిర్వహించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారికి అందజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, నూకల బలరాం,



యూనియన్ జిల్లా కన్వీనర్ సత్యవేణి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు విప్పర్తి మోహనరావు, యూటీఎఫ్ నాయకులు జనిపల్లి సత్యనారాయణలతో పాటు పలువురు పాల్గొని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు. సీఐటీయూ నాయకుడు నిమ్మకాయల వెంకటేష్, భోజన నిర్మాహణ కార్మికులు లక్ష్మీదేవి, కృష్ణకుమారి, బొంతు పార్వతి, గుత్తుల కనకదుర్గ, గంగారత్నం, సత్యవతి, సుభద్ర, సుశీల, రమావతి, నాగలక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



గిరిజన సంప్రదాయ నృత్యాలు



దప్పు వాయిద్యాల సందడి

వైభవంగా గిరిజనోత్సవం







కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న రిజిస్ట్రార్ తదితరులు

- నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు
- విశేషంగా ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు
- డప్పు వాయిద్యాలతో మార్మోగిన ప్రాంగణం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 5: సంస్కృతి, సంప్రదాయాలు, సంస్కారాలు గిరిజనుల వారసత్వ సంపద అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్సిటీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మరో ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కళలలోనే సమాజ వికాసం ఇమిడి ఉంటుందన్నారు. టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు రెండు రోజులపాటు జరుగుతాయని, ఏపీతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కళాకారులు వచ్చారన్నారు. కళాకారులు థింసా, తప్పెటగుళ్లు వంటి 35 గిరిజన కళారూపాలను ప్రదర్శిస్తారన్నారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో అంతరించిపోతున్న జాతుల్లో ముఖ్యంగా గిరిజన జాతి ఉందని, ఈ ఆదివాసీ ఆచార సంప్రదాయాలు, కళలను కాపాడుకోవలసిన బాధ్యత తమపై ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని కోరారు. తమ సంప్రదాయ నృత్యాలు, కళలను కాపాడుకునే సమష్టి బాధ్యతలో భాగంగానే ఈ ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన జాబితాలో ఇతర కులాలను చేర్చాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నన్నయ వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కె.ఉపేంద్రరెడ్డి, టీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.విష్ణునాయక్, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌నాయక్, నాయకులు రాజకుమార్‌రెడ్డి, భగవాన్, వెస్లీ, రఘు, రామరాజు, వెంకటేష్, వెంకటేశ్వర్లు నాయక్, రఘునాథ్‌నాయక్, మల్లేష్ పాల్గొన్నారు. ఈ ప్రదర్శనల్లో కొందరు విశ్వవిద్యాలయ అధికారులు కూడా కొద్దిసేపు కళాకారులతో కలిసి నృత్యాలు చేశారు. తొలుత యూనివర్సిటీ ప్రధాన ద్వారం నుంచి సభ జరిగే భవనం వరకూ కళారూప ప్రదర్శనలతో ఊరేగింపు నిర్వహించారు.



ధగధగ

రత్నగిరిపై శంఖుచక్రాలు, నామం ఏర్పాటు

అన్నవరం, ఫిబ్రవరి 5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో 42 అడుగుల పొడవు, 90 అడుగుల వెడల్పు కొలతలు కలిగి సుమారు 70 లక్షల వ్యయంతో శంఖు, చక్ర, నామాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఈవో రామచంద్రమోహన్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా రాత్రి 7 గంటలకు విద్యుత్ దీపాలతో వెలిగించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈ సూర్యనారాయణ, డీఈ రాంబాబు, ఏఈ చౌదరి, అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు. సముద్రతీరం నుంచి జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలలో, రైలులో ప్రయాణించే ప్రయాణికులకు సైతం ఈ శంఖు, చక్ర నామాల విద్యుత్ దీప అలంకరణలో కనపడతాయి.

ఐటీడీఏ స్పందనకు 53 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం, ఫిబ్రవరి 5: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో సుమారు 53 దరఖాస్తులు అందాయని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఆయన సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి స్పందన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కానివాడ పంచాయతీ సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలని, పింఛన్లు మంజూరు చేయాలని, ఆకూరు పంచాయతీలో జాఫ్రా పంట రైతులకు టార్పాలిన్లు మంజూరు చేయాలని, మాడేరు వాగులో రైతులకు నీరు మళ్లించేందుకు చేసిన ఐ రన్ సెర్లకు చెల్లించాల్సిన సొమ్మును మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఎస్డీసీ డీఎస్ శాస్త్రి, డీడీ అబుసలాం, ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, పశుసంవర్ధక డీడీ షరీఫ్, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీఈవో మల్లేశ్వరరావు, డీఎస్‌పీవో రాఘవన్, డీఎల్‌పీవో కె.కోటేశ్వరరావు, వైద్యాధికారిణి ఇందిరా పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజలు

నిడదవోలు, ఫిబ్రవరి 5: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మను సోమవారం పలువురు అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ ఆర్కియాలజీ మ్యూజియం కమిషనర్ జి.వాణీమోహన్ అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస్, సమిశ్రగూడెం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఎన్‌వీవీ రమేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితో ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా ఈవో బళ్ల నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకట కృష్ణ అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

120 పట్టాలపై పాత తేదీతో సంతకాలా?

- బిక్కవోలులో బదిలీ అయిన తహశీల్దార్ నిర్వాకం ఇది..
- సెలవు రోజు వచ్చి సంతకాలు చేయడంపై అనుమానాలు
- ఇళ్ల పట్టాల పేరుతో దోపిడీ: నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఫిబ్రవరి 5: బదిలీ అయిన తహశీల్దార్ వచ్చి పాత తేదీతో 120 పట్టాలపై సంతకాలు పెట్టడం చర్చనీయాంశమైంది. బిక్కవోలులో జగనన్న ఇళ్ల పట్టాల పేరుతో భారీ దోపిడీ జరుగుతుందని, బదిలీ అయిన తహశీల్దార్ ఆదివారం వచ్చి 120 పట్టాలపై సంతకాలు పెట్టడమేమిటని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. టీడీపీ నేతలతో కలిసి సోమవారం బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయంలో అధికారులను కలిసి విలేకరులతో మాట్లాడారు. బదిలీ అయిన తహశీల్దార్ పోసిబాబు ఆదివారం వచ్చి 120 పట్టాలపై సంతకాలు చేశారని తెలిపారన్నారు. ఈ పట్టాలన్నీ గతంలో జగనన్న లేఅవుట్లలో దారికోసం వదిలిన భూములని తెలిపారు. ఈ పట్టా ఒక్కింటికీ రూ. 1.50 లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బిక్కవోలులో 940 పట్టాలు ఇచ్చారని దీంతో రూ.10 కోట్లు వరకూ చేతులు మారాయన్నారు. పార్టీలకతీతంగా ఇళ్లిస్తున్నామని చెప్పుకుంటున్న నేతలు అనర్హులు, డబ్బులు ఇచ్చిన వారికే పట్టాలు ఇస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం ఈ పట్టాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన తహశీల్దార్ వచ్చి పాత తేదీలతో ఎలా సంతకాలు పెట్టారన్న విషయాన్ని ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని రామకృష్ణారెడ్డి వివరించారు. గ్రామానికి చెందిన మాదిరెడ్డి శాంతికి మూడేళ్ల కిందట స్థలం కేటాయించామని పట్టా ఇచ్చి ఇప్పటివరకు స్థలం చూపించకుండా తిప్పుతున్నారన్నారు. ఆమె డబ్బు ఇవ్వకపోవడమే దానికి కారణమన్నారు. ఆయన వెంట దేశం నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి వాసు, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, రాయుడు రామచంద్రరావు, ఇంటి స్థల బాధితురాలు మాదిరెడ్డి శాంతి ఉన్నారు.

సర్పంచుల అక్రమ అరెస్టు దారుణం

- చలో అసెంబ్లీకి వెళ్లకుండా సర్పంచ్‌ల హౌస్ అరెస్టులు
- మహిళా సర్పంచ్ ఇంటి వద్ద ఏఎస్ఐతో బందోబస్తు
- సర్పంచ్‌కు మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు



మాచవరంలో సర్పంచ్ ఇంటి వద్ద టీడీపీ నేతల నిరసన

అంబాజీపేట, ఫిబ్రవరి 5: సర్పంచ్‌ల 16 డిమాండ్లు నెరవేర్చాలని మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు ఒక రోజు ముందుగానే సర్పంచ్‌లను హౌస్ అరెస్టు చేశారు. వైసీపీ ప్రభుత్వం కాజేసిన ఆర్థిక సంఘం నిధులను తక్షణం సర్పంచ్ ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టే నిరసనను ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి విజయవాడకు వెళ్తున్న సమయంలో అంబాజీపేట పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. సర్పంచ్‌తో పాటు ఆమె భర్త నాగాబత్తుల వెంకటసుబ్బారావును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మహిళా సర్పంచ్ ఇంటి వద్ద మహిళా పోలీసులను కాపాలా ఉంచాల్సి ఉండగా పోలీసులు సాధారణ దుస్తులతో ఓ ఏఎస్ఐను బందోబస్తుగా ఉంచారు. దీనిపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. చలో అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడంతో సర్పంచ్ శాంతకుమారి ఇంటి వద్ద దీక్ష చేపట్టింది. టీడీపీ నాయకులు సర్పంచ్ ఇంటి వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరి నశించాలని నినాదాలు చేశారు. సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం వెళ్తుంటే పోలీసులు గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. తక్షణం ప్రభుత్వం కాజేసిన ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్ ఖాతాలకు జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, అరిగెల బలరామమూర్తి, బొంతు పెదబాబు, చిన్నం బాలవిజయరావు, రవణం రాము, గుడాల ఫణి, పబ్బినీడి రాంబాబు, కొప్పినీడి ఈశ్వరరావు, వార్డు సభ్యులు మద్దతు తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తం నిర్వహిస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 5: సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మార్చి 6 నుంచి 11 వరకూ జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలు పురస్క రించుకుని ఆలయ ఆవరణలో ఉత్సవ ఏర్పాట్లు ప్రారంభంలో భాగంగా సోమవారం పందిరి రాట ముహూర్త పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఉత్సవాలు

భక్తులు, అధికారులు అందరి సహకారంతో మార్చి 6 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించాలని సామర్లకోట భీమేశ్వరాలయ ఆలయ ఈవో డి. నాగ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆలయ ఆవరణలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై వివిధ వర్గాలు, భక్త కమిటీ తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి మహా శివరాత్రి ఉత్సవాలకు భక్తులు విచ్చేయనున్నందున వారికి ఏ అసౌకర్యం లేకుండా పటిష్ఠమైన ఏర్పాట్లను చేయాలని పలువురు సూచించారు. ఆలయ కోనేరు పుష్కరిణిలో పాతనీటిని పూర్తిగా పంపింగ్ చేసి చెరువు అంతటా ఇసుక వేసిన అనంతరం నీటిని నిల్వ చేయాలని పలువురు భక్తులు సూచించారు. వీఐపీ దర్శనాలతో సాధారణ క్యూలైన్లలో దర్శనాలకు వెళ్లే భక్తులకు ఏ అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు సూచించారు. సమావేశంలో బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

విశాఖలో ప్రమాదం

సీపీ రెడ్డి హీరో మోటార్స్ షోరూం అధినేత కుమారుడు దుర్మరణం



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5: విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజమహేంద్రవరానికి చెందిన సీపీ రెడ్డి హీరో మోటార్స్ షోరూం అధినేత చింతా ప్రసాద్ రెడ్డి తనయుడు చింతా నాగ ప్రణవ్ రెడ్డి (24) మృతిచెందారు. రాజమహేంద్రవరానికి చెందిన సీపీ రెడ్డికి కుమారుడు నాగప్రణవ్‌రెడ్డి, కుమార్తె ఉన్నారు. విశాఖపట్నం గీతమ్స్ కళాశాలలో ప్రణవ్ రెడ్డి ఎంబీఏ చదువుతున్నాడు. కొద్ది రోజుల కిందట సెలవులకు రాజమహేంద్రవరం వచ్చిన ప్రణవ్ ఇటీవల తిరిగి విశాఖ వెళ్లాడు. ఆదివారం రాత్రి రుషికొండ నుంచి తన మోటార్ బైక్‌పై వెళుతుండగా ఎదురుగా బుల్లెట్‌పై అతివేగంగా ఇద్దరు యువకులు వచ్చి ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రణవ్ రెడ్డిని ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. నాగప్రవణ్‌రెడ్డి మృతదేహాన్ని సోమవారం రాజమహేంద్రవరంలోని దానవాయిపేట ఇంటికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. జక్కంపూడి విజయలక్ష్మి, టీకే విశ్వేశ్వర రెడ్డి, స్వర్ణాంధ్ర నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, గంటా సునీల్, వ్యాపారవేత్తలు, ప్రముఖులు ప్రణవ్ నివాళులర్పించారు. సీపీ రెడ్డిని కుటుంబీకులు ఓదార్చారు.

జనసేన నేతపై కత్తులతో దాడికి ప్రయత్నం

పోలీసులకు ఫిర్యాదు



వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాసరావు

పిఠాపురం, ఫిబ్రవరి 5: కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల జనసేన పార్టీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం నలుగురు వ్యక్తులు హల్‌చల్ చేశారు. వారు తనపై కత్తులతో దాడికి ప్రయత్నించారని జనసేన నాయకుడు మాదేపల్లి శ్రీనివాసరావు రాత్రి పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద రోడ్డు మీద నిలుచుని ఫోన్ మాట్లాడుతుండగా, నలుగురు వ్యక్తులు తన వద్దకు వచ్చి వారు తెచ్చుకున్న కత్తులతో దాడికి ప్రయత్నించారని ఫిర్యాదులో తెలిపారు. తాను గట్టిగా కేకలు వేయడంతో టూ వీలర్ మీద పరారయ్యారని పేర్కొన్నారు. రాజకీయంగా జనసేన పార్టీలో చురుకుగా పనిచేయడం చూసి ఓర్వలేక ఈ దాడి చేయించడానికి ప్రయత్నించినట్లు తనకు అనుమానం ఉందని ఫిర్యాదులో తెలిపారు. పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీమోహన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో మాదేపల్లి శ్రీనివాసరావు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి కిరణ్ తదితర నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన బలోపేతం అవ్వడం చూసి ఓర్వలేకే కత్తులతో దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. ఇటువంటి వాటికి జనసైనికులు, నాయకులు బెదిరే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. జనసేన పటిష్టత కోసం మరింత కష్టించి పనిచేస్తామని తెలిపారు. కాగా ఈ సంఘటనపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆరా తీశారు.

పి.గన్నవరం జనసేన ఇన్‌చార్జిగా గిడ్డి సత్యనారాయణ



పి.గన్నవరం, ఫిబ్రవరి 5: పి.గన్నవరం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జిగా గిడ్డి సత్యనారాయణను నియమిస్తూ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం రాత్రి నియామక ఉత్తర్వులు అందించినట్లు ఉమ్మడి జిల్లాల జనసేన ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు తెలిపారు. పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామానికి చెందిన సత్యనారాయణ తెలంగాణ రాష్ట్రం పోలీస్‌శాఖలో ఏవోగా పనిచేశారు. ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామ చేసి సోమవారం మంగళగిరి పార్టీ ప్రధాన కార్యాలయంలో అధినేత సమక్షంలో పార్టీలో చేరారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. పార్టీకోసం కష్టపడి పనిచేసి రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని అధినేత పవన్‌కల్యాణ్ సూచించినట్లు గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లాల పార్టీ కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, దొమ్మేటి సాయికృష్ణ, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, నాయకులు యల్లమిల్లి చిట్టిబాబు, అడబాల తాతకాపు, సలాది బుచ్చిరాజు, తాటికాయల శ్రీనివాస్ ఉన్నారు.

దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ పూజలు



ఆలయంలో దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్



బంగారు తిరునామం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ కేవీఎల్ హరినాథ్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఈవో ముదునూరి సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. వేంకటేశ్వరస్వామికి లొల్ల గ్రామానికి చెందిన ముక్కవిల్లి శ్రీరామచంద్రమూరి-లక్ష్మీనరసమాంబ దంపతులు 9.6 గ్రాములతో చేయించిన బంగారు తిరునామాన్ని సమర్పించారు. సంప్రోక్షణ అనంతరం స్వామివారికి అలంకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,90,954 లభించినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తొండంగి, ఫిబ్రవరి 5: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు అన్నవరం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. సోమవారం సాయంత్రం అన్నవరం గ్రామానికి చెందిన లింగంపల్లి శ్రీను(58) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా బెండపూడి వైపు వెళ్తున్న ప్రైవేటు స్కూల్ బస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు యువతి

క్షేమంగా అప్పగించిన తుని రైల్వే పోలీసులు

తుని రూరల్, ఫిబ్రవరి 5: తల్లిదండ్రులపై అలిగి ఇంటి నుంచి పారిపోయిన యువతిని తుని రైల్వే పోలీసులు గుర్తించారు. అన్నవరం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రైల్వే పోలీసు సూర్యప్రకాష్ ఆమెను గమనించి ఆరా తీశారు. అత్తిలి పట్నానికి చెందిన వాకభట్ల నాగ సాయి దేవికగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి బాలికతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బాలికను అప్పగించారు.

కొండరెడ్ల గ్రామాలకు విద్యుత్

- రూ.14.96 కోట్ల అంచనా
- రంప ఐటీడీఏ పీవో సూరజ్



విద్యుత్ పనులు చేస్తున్న కార్మికులు

రంపచోడవరం, ఫిబ్రవరి 5: ఏజెన్సీలో రూ.14.96 కోట్ల అంచనా వ్యయంతో కొండరెడ్ల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్మన్ పథకం ద్వారా పీవీటీజీలు నివసిస్తున్న 314 గ్రామాలకు విద్యుత్ సౌకర్యంతో పాటు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 930 కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని, ఈ నెల చివరి నాటికి పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

అమలాపురం-చల్లపల్లి పంటకాల్వలో మళ్లీ మొసలి కలకలం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 5: అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంటకాల్వలో మళ్లీ మొసలి కలకలం రేగింది. గోపవరం పంచాయతీ జయపురం వద్ద పంటకాల్వలో సోమవారం ఉదయం తమకు మొసలి కనిపించిందంటూ పలువురు మహిళలు, వృద్ధులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము మొసలిని చూశామంటూ సర్పంచ్ కుంచే బుల్లియ్యకు గ్రామస్తులు వివరించారు. కాల్వ పక్కనే నివాసముంటున్న తమ కుటుంబాలకు మొసలి వల్ల ఎటువంటి ప్రమాదం సంభవించకుండా చూడాలని మొరపెట్టుకున్నారు. అధికారులతో మాట్లాడి అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటానని సర్పంచ్ హామీ ఇచ్చారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

రాజోలు, ఫిబ్రవరి5: రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 6నుంచి 10వతరగతి వరకు బోధించే గణితం, సైన్స్‌ఉపాధ్యాయులకు ఐసీటీ సిమ్యులేషన్ శిక్షణను మూడు రోజులు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం సోమవారంతో ముగిసిందని ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. ఈకార్యక్రమానికి పరిశీలకుడిగా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బి.సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.విద్యావిధానంలో సైన్స్, గణితంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఈశిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

- మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- వానపల్లిలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం
- సైకో జగన్‌ను ఇంటికి సాగనంపాలి

వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేయాలి

కొత్తపేట, ఫిబ్రవరి 5: అన్ని వర్గాలను, వ్యవస్థలను నాశనం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు కోరారు. సోమవారం ఆయనకు వానపల్లి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాల్పుల నడుమ బండారు గ్రామంలో పర్యటించి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సత్యానందరావు మాట్లాడుతూ సైకో పాలనను అంతమొందించి జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. జనసేన తరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసిన సిద్ధాబత్తుల సత్యానారాయణ, ఇళ్ళ కృష్ణారావు జనసేనకు రాజీనామా చేసి సత్యానందరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వాసంశెట్టి ధనరాజు, అప్పారి పల్లంరాజు, రాయుడు రత్నంరాజు, పట్టా ధర్మరాజు, ముళ్ళ రాంబాబు, మట్టపర్తి సుబ్రహ్మణ్యం, సిద్దుల పల్లంశెట్టి, నేదునూరి దొరబాబు, గనిశెట్టి సత్తిపండు, చవ్వాకుల వెర్రియ్య, అప్పారి రాజు, బీకరమిల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో 250 మంది వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వారందరికీ సత్యానందరావు పార్టీ కండువాలువేసి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, చిలువూరి సతీష్‌రాజు, పల్లి భీమారావు, దర్నాల రామకృష్ణ, యల్లమిల్లి జగన్మోహన్, బూసి జయలక్ష్మిభాస్కరరావు, ముత్యాల బాబ్జీ, రెడ్డి రామకృష్ణ, గనిశెట్టి సత్యనారాయణ, కంచుస్తంభం రామకృష్ణ, తోరాటి నాయుడు, గుత్తుల పట్టాభి రామారావు, బండారు వీరబాబు, పల్లి ఏసు, ముద్రగడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.




కొత్తపేట: వైసీపీ, జనసేన నుంచి టీడీపీలోకి చేరిన వారిని ఆహ్వానించిన బండారు సత్యానందరావు, ఐ.పోలవరం: జయహో బీసీ సదస్సులో పాల్గొన్న నాయకులు

బీసీల వెన్నంటే టీడీపీ: దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం, ఫిబ్రవరి 5: తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీల వెన్నంటే ఉంటుందని మాజీఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత మాత్రమే బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరిగిందన్నారు. ఐ.పోలవరం సాయిబాబా గుడి వద్ద టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు లంకే శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో టీడీపీ బీసీలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తే జగన్ ప్రభుత్వం పది శాతం తగ్గించి బీసీలకు అన్యాయం చేసిందన్నారు. ఈకారణంగా బీసీలు స్థానిక ఎన్నికల్లో 16వేల పదవులను కోల్పోయారన్నారు. జనసేన పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ మాట్లాడుతూ టీడీపీ, జనసేన ప్రభుత్వం రాష్ట్రంలో యువతకు బంగారు భవిష్యత్తు కల్పిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, గంజా సుధాకర్, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, మద్దింశెట్టి పురుషోత్తం, మందాల గంగసూర్యనారాయణ, తాడి నరసింహారావు, పిల్లి నాగరాజు, వాడ్రేవు వీరబాబు, దాసరి జగదీశ్వరి, సాకా సీతాదేవి, బీర సత్యకుమారి, వాసంశెట్టి అమ్మాజీ, టేకుమూడి లక్ష్మణరావు, బొంతు శ్రీరాములు, దాట్ల పృథ్వీరాజు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



మండపేట: వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన దృశ్యం

మండపేట, ఫిబ్రవరి 5: స్థానిక 12వ వార్డుకు చెందిన 30మంది వైసీపీ కార్యకర్తలు వార్డుకు చెందిన కొవ్వాడ అప్పన్నబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ యువనేత వల్లూరి సాయికుమార్‌బాబు సమక్షంలో సోమవారం పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ గృహసారథులు, ఇందుగపల్లి ప్రసాద్, మండపల్లి సూరిబాబు, ఎగ్గాడి సతీష్, అమ్మాజీ, మహాలక్ష్మి, కుమారి తదితరులు చేరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబాబు, అప్పన్నబాబు, సత్తిబాబు, వీరబాబు, గడిరాంబాబు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు

కొత్తపేట, ఫిబ్రవరి 5: కొత్తపేట మాజీ ఉపసర్పంచ్, జనసేన నాయకుడు సలాది రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ఆ పార్టీలో చేరారు. వారికి నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ కండువాలువేసి ఆహ్వానించారు. నాయకులు సంగిత సుభాష్, కంఠంశెట్టి చంటి, పల్లికొండ సుధీర్‌కుమార్, తులా రాజు, చోడపనీడి ఉమ, సత్యతులసి, రమాదేవి పాల్గొన్నారు.

షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న పార్లమెంటు కోఆర్డినేటర్ శివప్రసాద్

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 5: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిపై వైసీపీ మంత్రులు అవాకులు, చవాకులు పేలుతున్నారని, ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంటు నియోజకవర్గకో-ఆర్డినేటర్ మట్టా వెంకటశివప్రసాద్ హెచ్చరించారు. గతంలో వైసీపీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబులు ఏ పార్టీ నుంచి వచ్చారో గుర్తుచేసుకుని మాట్లాడాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వైసీపీ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. బండారులంకలోని కాంగ్రెస్ జిల్లా శాఖ కార్యాలయంలో అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు వంటెద్దు బాబి, మహ్మద్ ఇస్మాయిల్ ఆరిఫ్, కుదుపూడి శ్రీను, వడ్డి నాగేశ్వరరావు, సంసాని రామకృష్ణ, రౌతు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పీఏసీ సభ్యుడు బాలకృష్ణను కలిసిన కాపునేతలు



ముమ్మిడివరం, ఫిబ్రవరి 5: జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణను కాపునేతలు పలువురు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు అధ్యక్షుడు కోటిపల్లి వెంకటరామారావు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు రేకపల్లి సురేష్, కార్యదర్శి గంగాధర్, రైతు విభాగం అధ్యక్షుడు పి.ప్రసాద్ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన కాపుసంఘ నాయకులు పితాని బాలకృష్ణను కలిసి సత్కరించారు. ముమ్మిడివరం నియోజకవర్గ అధ్యక్షుడు పెమ్మిరెడ్డి వీరవెంకటసత్యనారాయణ, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాధ్యక్షులె గుద్దటి వీరాస్వామి(విజయ్), సలాది శ్రీహరి,లంకలపల్లి వెంకటేశ్వరరావు, సుంకర రామచంద్రరావు, రామచంద్రపురం, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల అధ్యక్షులు బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

కళాశాల భవనాన్ని పునర్నిర్మించాలని విద్యార్థుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5: శిథిలావస్థలో ఉన్న ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని వెంటనే పునర్నిర్మించాలని డిమాండు చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుని 20ఏళ్ల గడిచినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆరోపించారు. రక్షణ లేని కళాశాలలో చదువుకునేది ఎలా అని నినాదాలు చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్జి, జిల్లా కన్వీనర్ జి.రవికుమార్, సహ కన్వీనర్ కె.వెంకట్, నాయకులు వై.సాయి, జి.సందీప్, భానుకార్తీక్, జి.సతీష్ పాల్గొన్నారు.

13నుంచి హిమాలయ యోగి పర్యటన

అమలాపురంటౌన్, ఫిబ్రవరి5: అంతర్జాతీయ యోగా నిపుణుడు హిమాలయ యోగి యష్ శేఖర్ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈనెల13 నుంచి మూడు రోజులు జిల్లాలో పర్యటించనున్నారని దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధి విశ్వనాథ్ తెలిపారు. అమలాపురం విద్యుత్ నగర్‌లోని ఆదిశేషా నిలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల13నధ్యానం, యోగా,ఆరోగ్యంపై ప్రసంగిస్తారని తెలిపారు. నడింపల్లి రామకృష్ణంరాజు, సుభద్ర, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, అక్షయపాత్ర ప్రతినిధులు పోతురాజు కనకదుర్గ పాల్గొన్నారు.

జీవనియంత్రణపై అవగాహన

అంబాజీపేట, ఫిబ్రవరి 5: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యానపరిశోధన కేంద్రంలో అఖిలభారతజీవనియంత్రణ సమన్వయ పథకంపై అవగాహన కార్యక్రమాలు మంగళవారం,బుధవారం నిర్వహించనున్నట్లు పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు.

ఓ ఇంట్లో నాగుపాము హల్‌చల్

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 5: చల్లపల్లికి చెందిన మేకల వీర వెంకటేశ్వరరావు ఇంట్లో సోమవారం నాగుపాము హల్‌చల్ చేసింది. స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మ నాగుపామును పట్టుకుని సురక్షిత ప్రాంతంలో వదిలారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

రావులపాలెం, ఫిబ్రవరి 5: వాహనచోదకులు రహదారి భద్రతా నియమాలు పాటించాలని డీటీవో డి.అశోక్‌ప్రతాపరావు కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈతకోట టోల్‌గేట్ వద్ద ఎంవీఐ వి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో వాహనచోదకులకు పువ్వులు ఇప్పించి హెల్మెట్, సీటు బెల్ట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ఎంవీఐ కేవీ నాగేంద్ర, సత్యసాయి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఐలు బాధ్యతలు స్వీకరణ

ఆత్రేయపురం, ఫిబ్రవరి 5: ఆత్రేయపురం ఎస్‌ఐగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాలకొల్లు నుంచి బదిలీపై వచ్చారు.

అయినవిల్లి: అయినవిల్లి ఎస్‌ఐగా వి.రాజేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పలువురు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన కె.సురేష్‌బాబు బదిలీపై రామచంద్రపురం వెళ్లారు.

అంబాజీపేట: అంబాజీపేట ఎస్‌ఐగా కె.చిరంజీవి బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం అర్బన్ నుంచి ఆయనను పలువురు కలుసుకుని అభినందనలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఏ.చైతన్యకుమార్ మండపేట రూరల్ స్టేషన్‌కు బదలీపై వెళ్లారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ద్రాక్షారామ,ఫిబ్రవరి 5: యానాం నుంచి మద్యం తరలిస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన షేక్‌షరీఫ్, మండపేట మండలం ద్వారపూడికి చెందిన వల్లేపల్లి కిషోర్‌ను వేగాయమ్మపేట వద్ద పోలీసులు అరెస్టు చేశారు. రెండేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు.

చంద్రబాబు, లోకేష్‌ను విమర్శించే స్థాయి కొడాలి నానికి లేదు: బాలకృష్ణ

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 5: మాజీ సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్‌లను విమర్శించే స్థాయి వైసీపీ మాజీ మంత్రి కొడాలి నానికి లేదని విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు నెక్కంటి బాలకృష్ణ అన్నారు. అంగరలో సోమవారం స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కుటుంబంపై నాని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సీఎం జగన్ మెప్పుపొందేందుకు చంద్రబాబును వ్యక్తిగతంగా నాని విమర్శిస్తున్నారని అన్నారు. రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో కొడాలి నాని పరిస్థితి కుక్కలు చిప్పిన విస్తరిలా ఉంటుందని బాలకృష్ణ హెచ్చరించారు.

చిత్రలేఖన పోటీలు

మామిడికుదురు, ఫిబ్రవరి 5: భారతీయ చిత్రకారుడు దామెర్ల రామారావు వర్ధంతిని పురస్కరించుకుని ఈదరాడ హైస్కూలులో చిత్రలేఖన పోటీలు సోమవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. దామెర్ల రామారావు చిత్రపటానికి హెచ్‌ఎం జి.సాయిబాబా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజ్ఞ, డ్రాయింగ్ టీచరు బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు విడతల్లో పరిహారం విడుదల చేయండి



నాయకుల సమావేశంలో పాల్గొన్న మల్లాడి కృష్ణారావు

యానాం, ఫిబ్రవరి 5: యానాం మత్స్యకారులకు ఓఎన్జీసీ సంస్థ నుంచి రావలసిన పరిహారం రెండు విడతల్లో విడుదల చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. రెండు రోజుల క్రితం పరిహారం విడుదల చేయాలని ఇచ్చిన పుదుచ్చేరి ప్రభుత్వం రాసిన లేఖను కాకినాడలోని ఓఎన్జీసీ అధికారులకు ఇచ్చారు. ఓఎన్జీసీ ఈడీ రత్నేష్‌కుమార్ కోరిన విధంగా పుదుచ్చేరి ప్రభుత్వం లేఖ రాసిందన్నారు. పరిహారం ప్రభుత్వ ఖాతాలో తక్షణం జయచేయాలని చమురుసంస్థల హెచ్‌ఆర్ సునీల్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ గంగోలిని మల్లాడి కోరారు. తన స్వగృహంలో ఉదయం వివిధ పార్టీల నాయకులకు, మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం పుదుచ్చేరి ప్రభుత్వ ఖాతాలో ఉన్న రూ.23కోట్లు, ఓఎన్జీసీ సంస్థ వద్ద ఉన్న రూ.71కోట్లు 5,462మందికి రూ.11,500 చొప్పున తొలి విడతలో 15నెలలకు పరిహారం ఇవ్వాలన్నారు. ఎన్నికల తర్వాత 12నెలలకు పరిహారం ఇవ్వాలన్నారు. ఈనెల14న సీఎం ఎన్.రంగసామి, మత్స్యశాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ, అధికారులతో యానాంలో పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

కమిషనర్‌గా వెంకటరామిరెడ్డి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 5: ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా జి.వెంకటరామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జి.లోవరాజు చిరువూరు మున్సిపాల్టీకి బదిలీపై వెళ్లారు. వెంకటరామిరెడ్డిని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

కాపునాడు బలోపేతానికి కృషి

మామిడికుదురు, ఫిబ్రవరి 5: నియోజకవర్గంలో కాపునాడు బలోపేతానికి కృషి చేస్తానని కాపునాడు పి.గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు కొమ్ముల కొండలరావు అన్నారు. పాశర్లపూడికి చెందిన కొండలరావును సోమవారం ముమ్మిడివరంలో జరిగిన సమావేశంలో కాపునాడు జాతీయ అధ్యక్షుడు గళ్లా సుబ్రహ్మణ్యం నియామక పత్రం అందించారు. కొండలరావును పలువురు అభినందించారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

రామచంద్రపురం, ఫిబ్రవరి 5: భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవా రం న్యాయవాదులు నిరసన తెలిపారు. ప్రజల ఆస్తి హక్కులను హరించే భూహక్కు చట్టాన్ని నిలిపి వేయాలని న్యాయవాదులు నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి మురళీమోహన్ వెంకట రమణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారా యణ, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వీ, సీనియర్ న్యాయవాదులు డి.పి.శాస్త్రి, డి.సత్యనారాయణ, ఆర్.వి.జి.సుబ్బారావు, బినయ్ బాబు, ఐ.గంగాధర్, కె.వి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దళిత సింహగర్జనను విజయవంతం చేయాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 5: రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరి వద్ద ఈనెల11న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే దళిత సింహగర్జనను విజయవంతం చేయాలని దళిత నాయకులు కోరారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నూకపెయ్యి చిన్న, కత్తుల బాబులు, గోసంగి సత్యనారాయణ, నాగాబత్తుల నరసింహమూర్తి, అన్నవరం, బీర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 5: మొగలికుదురులో తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ గ్రామస్తులు సోమవారం పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. వినతిపత్రాన్ని పంచాయతీ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం, ఫిబ్రవరి 5: గోడి బాలుర గురుకుల పాఠశాల, కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి10న జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసేవారు మాత్రమే ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులన్నారు. 5వతరగతిలో 80, ఇంటర్ ఎంపీసీలో 40, బైపీసీలో 40సీట్లు ఖాళీలున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలో గాయత్రి ప్రతిభ

అల్లవరం, ఫిబ్రవరి 5: హాస్య బ్రహ్మ బ్రహ్మానందం పుట్టినరోజు సందర్భంగా సాంగటీస్ ఆర్ట్స్ అకాడమీ ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో ఆన్‌లైన్ చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. డిజిటల్ మిక్స్‌డ్ మీడియా ఆర్ట్ విభాగంలో గోడిలంక గ్రామానికి చెందిన దారా గాయత్రి ఆన్‌లైన్ ద్వితీయ స్థానంలో నిలిచి బ్రహ్మానందం నుంచి అవార్డు అందుకుంది. గాయత్రిని కేవీపీఎస్ ఉపాధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీదుర్గారావు, వడ్డి సోమన్న, కుంచే చంద్రరావు, పోతుల నాగేశ్వరరావు, శెట్టిబత్తుల బాలకృష్ణమూర్తి, కటారి చంద్రరావు తదితరులు ఘనంగా సత్కరించారు.

మండల సమావేశం వాయిదా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మండపేట, ఫిబ్రవరి 5: సోమవారం జరగాల్సిన మం డపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు. పార్లమెంట్, అసెంబ్లీ సమావే శాలు జరుగుతున్నప్పుడు సమావేశాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనా నికి అధికారులు స్పందించి సమావేశాన్ని వాయిదా వేశారు.

సమగ్ర కౌలు రైతుల చట్టం తేవాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 5: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో సమగ్ర కౌలు రైతుచట్టం తీసుకురావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబుడిమాండు చేశారు. నాలుగున్నరేళ్లుగా కౌలు రైతుల సమస్యలు, డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా ఇంతవరకు పరిష్కరించలేదన్నారు. కౌలు రైతులకు భూ యజమానుల ప్రమేయం లేకుండా గుర్తింపుకార్డులు జారీ చేయాలన్నారు. సోమవారం అమలాపురంలో జరిగిన సీపీఐ నాయకుల సమావేశంలో సత్తిబాబు మాట్లాడారు. పెట్టుబడి సాయం ఎకరాకు రూ.15వేలు చొప్పున కౌలు రైతులకు అందించాలన్నారు. నియోజకవర్గ కార్యదర్శి శీలం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మోకా శ్రీనివాసరావు, కామిశెట్టి నాగబాబు, అయితాబత్తులసుబ్బారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాయవరం, ఫిబ్రవరి 5: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని రామచంద్రపురం మోటారువెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం రాయవరం వివేకానంద స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సైకిల్‌పై, నడిచి వెళ్లే సమయంలో పాటించాల్సిన నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బీఏఎస్ సరోజిని విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటరమణ	: బూట్‌కట్ బాలరాజు
శ్రీలలిత	: ధీర
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరుకారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గేమ్ ఆన్

రియల్ ఎస్టేట్ బిజినెస్‌కు మట్టి తరలింపు

చక్రం తిప్పుతున్న వీఆర్వోలు



చెరువును రియల్ ఎస్టేట్ కోసం కప్పి పెట్టిన దృశ్యం

కాట్రేనికోన, ఫిబ్రవరి 5: కాట్రేనికోన మండలం మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారింది. లైసెన్సు లేని ట్రాక్టర్ డ్రైవర్లతో యథేచ్ఛగా మట్టి వ్యాపారం కొనసాగిస్తున్నారు. రాత్రుళ్ళు సెలవు దినాల్లో పని ముగించుకోవాలని వీఆర్వోలు ఇస్తున్న సలహాలతో వ్యాపారులు ముందుకు సాగుతున్నారు. కాపులపాలెంలో కొబ్బరి తోటను తవ్వి, ఆర్ అండ్ బి రహదారి పక్కన ఉన్న చెరువును పది రోజుల నుంచి పూడుస్తూ తారు రోడ్డును మట్టి రోడ్డుగా మారుస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కందికుప్ప పంచాయతీ గరువుపేటలో పదెకరాల చెరువును తవ్విన మట్టిని పల్లం ద్యాం సెంటర్లో లేఅవుట్లు మెరక చేసేందుకు వినియోగిస్తున్నారు.

బ్యాంకు ఖాతా నుంచి డబ్బు కాజేశారు

పి.గన్నవరం, ఫిబ్రవరి 5: మానేపల్లికి చెందిన ఉపాధ్యాయుడు మురముళ్ల అంజిబాబు బ్యాంకు ఖాతా నుంచి ఈనెల1న రూ.9,900, 4న రూ.9,900 కాజేశారు. బ్యాంకులో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వలంటీరుకు వేలిముద్ర వేసిన మరుసటి రోజు బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమైనట్లు తెలిపారు.

అంతర్వేది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అంతర్వేది, ఫిబ్రవరి 5: ఈనెల16 నుంచి 25వరకు జరిగే లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల వాల్‌పోస్టర్ గోడపత్రికలను ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సోమవారం ఆవిష్కరించారు. తొలుత అర్చకులు గోడపత్రికలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాటిని గోడలు, బస్సులకు అంటించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఐ.పోలవరం, ఫిబ్రవరి 5: మురమళ్ళ భద్రకాళీసమేత వీరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రూ.55లక్షలతో నిర్మించిన శ్రీవీరేశ్వర సూర్యబలిజ నిత్యాన్నదాన భవనాన్ని, రూ.4లక్షలతో నిర్మించిన గోకులం భవనాన్ని ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ప్రారంభించారు. అన్నదాన భవన నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చిన సూర్యబలిజ సంఘం కాలేవారి కుటుంబ సభ్యులను సత్కరించారు.ఖమ్మంకు చెందిన కొల్లు రాజేష్ విరాళంగా ఇచ్చిన రూ.6లక్షలు, అనాతవరానికి చెందిన నూకల సూర్యనారాయణ మూర్తి విరాళంగా ఇచ్చిన రూ.3లక్షలతో అన్నదాన భవనంలో స్టీమ్ ఏర్పాటు చేశారు. మాచిరాజు పావనిలక్ష్మీకాంతం జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు విరాళంగా ఇచ్చిన రూ.4లక్షలతో స్టోర్ రూమ్ నిర్మించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ప్రసాద్, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, సర్పంచ్ కాలే రాజబాబు, ఆలయ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు శంకుస్థాపనలు

రాజోలు, ఫిబ్రవరి 5: సోంపల్లి, వేగివారిపాలెం, చెన్నడం గ్రామాల్లో ఎంపీపీ గ్రాంటు నుంచి సోంపల్లి డ్రెయిన్ నిర్మాణానికి రూ.2.25లక్షలు, వేగివారిపాలెం ఓటరు ట్యాంకు నిర్మాణానికి రూ.3.75లక్షలు, చెన్నడంలో డ్రింకింగ్ వాటర్ లైన్ నిర్మాణానికి రూ.2లక్షలు, వేగివారిపాలెం డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎంపీపీ కేతా శ్రీను సోమవారం శంకుస్థాపన చేశారు. మండలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మట్టా శైలజ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, ఎంపీటీసీలు బయ్యా సునీత, సర్పంచ్‌లు బడుగు శ్రీనివాసరావు, కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు బాధ్యతలు స్వీకరణ

కె.గంగవరం, ఫిబ్రవరి 5: కె.గంగవరం తహసీల్దార్‌గా బి. రవీంద్రనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వైద్యనాథ్‌శర్మ అమలాపురం కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. రవీంద్రనాథ్‌ను డిప్యూటీ తహసీల్దార్ మురళీ, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, కార్యాలయం సిబ్బంది, ఎస్‌ఐ జానీబాషా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం తహసీల్దార్‌గా టి.మల్లికార్జునరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నంకలెక్టరేట్ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన జవ్వాది వెంటేశ్వరి ఆకివీడు బదిలీ అయ్యారు.

అంతర్వేది: సఖినేటిపల్లి తహసీల్దార్‌గా సీహెచ్ పెద్దిరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు పెద్దిరాజుకు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. పాలకొల్లు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన రమాకుమారి బదిలీపై వెళ్లారు.

రాయవరం: రాయవరం తహశీల్దారుగా ఆర్.వి.కిషన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరిజిల్లా పోడూరు నుంచి వచ్చిన ఆయనను డిప్యూటీతహశీల్దారు విజయరేఖ, ఆర్‌ఐ పి.రామారావు సిబ్బంది కలిశారు. ఇక్కడపనిచేసిన కె.జె.ప్రకాష్‌బాబు ఎన్టీఆర్ జిల్లాకు వెళ్లారు.

పి.గన్నవరం: పి.గన్నవరం తహసీల్దార్‌గా ఎస్‌కే హుస్సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడపనిచేసిన జీఆర్ రాగూర్ ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

రావులపాలెం: రావులపాలెం తహసీల్దారుగా డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ బాధ్యతలు చేపట్టారు. ఈయన పెనుమంట్ర నుంచి బదిలీపై వచ్చారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల తహసీల్దార్‌గా బి.శ్రీనునాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన సీహెచ్ విజయశ్రీ బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి వెళ్లారు.

మండపేట: మండపేట తహసీల్దార్‌గా సురేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేసిన టి.రాజేశ్వరరావు కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మలికిపురం: మలికిపురం తహసీల్దార్‌గా జి.అనితాకుమారి బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు నుంచి బదిలీపై వచ్చారు. తహసీల్దార్‌కు సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

వివేకానందుడి సందేశంపై జాగృతి పోటీ పరీక్ష

ఆలమూరు, ఫిబ్రవరి 5: ఆలమూరు సిద్ధార్థ పాఠశాలలో సోమవారం రాజమహేంద్రవరంలోని రామకృష్ణ మిషన్‌లో ఆధ్వర్యంలో వివేకానందుడి సందేశంపై జాగృతి పోటీ పరీక్ష నిర్వహించారు. 250మంది విద్యార్థులు పరీక్షలు రాశారని కరస్పాండెంట్ ముల్లారావు తెలిపారు.స్వామివివేకా నందుడి బోధనలు తెలుసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ శ్రీప్రమోద్‌లాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీఅభయ ఆంజనేయస్వామి వార్షికోత్సవం

పి.గన్నవరం, ఫిబ్రవరి 5: నరేంద్రపురంలో గత నెల 30న ప్రారంభమైన శ్రీఅభయ అంజనేయస్వామి 31వ వార్షికోత్సవాలు మంగళవారంతో ముగయనున్నాయి. రాష్ట్రం నలుమూలలు నుంచి వచ్చిన కళాకారులతో ఏడు రోజులు సప్తహం నిర్వహించారు. సోమవారం రూపాయి నాణేలు, పటికి బెల్లంతో పలువురు స్వామివారికి తులాభారం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక వర్తకుడు చెల్లి నాగేశ్వరరావు కుమారుడు కిషోర్ 80కిలోల రూపాయి నాణాలు తులాభారంగా సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మానికిరెడ్డి లక్ష్మణరావు, సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతిక నిపుణులు పరిశ్రమలు స్థాపిస్తే ఎంతో మేలు

కాట్రేనికోన, ఫిబ్రవరి 5: సాంకేతిక నిపుణులు పరిశ్రమలు స్థాపిస్తే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వి.రమామూర్తి అన్నారు. చెయ్యేరు శ్రీశ్రీనివాసా స్వయంప్రతిపత్తి ఇంజనీరింగు కళాశాలలో సోమవారం రోల్ ఆఫ్ జీవో స్పెషియల్ టెక్నాలజీస్ ఇన్ నేషన్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు నోటీసులు

మలికిపురం, ఫిబ్రవరి 5: సర్పంచ్‌ల సమస్యలపై అసెంబ్లీ ముట్టడికి సిద్ధమవుతున్న సర్పంచ్‌లకు మలికిపురం పోలీసులు ముందస్తుగా నోటీసులు అందజేశారు. నోటీసులు అందజేయడంపై పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి రాక్షస ప్రభుత్వానికి త్వరలోనే అంతం కానుందని మలికిపుర మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు యెనుముల నాగు, సర్పంచ్‌లు రాపాక ఆనంద్‌కుమార్, చెల్లుబోయిన హెలీన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పిల్లి సూర్యప్రకాష్ వార్డుల్లో పర్యటన

రామచంద్రపురం, ఫిబ్రవరి 5: వైసీపీ నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ సోమవారం స్థానిక వైఎస్సార్ నగర్ కాలనీలో పర్యటించారు. వైసీపీని గెలిపించాలని కోరారు. అనంతరం రాజబాబు నగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

యానాం, ఫిబ్రవరి 5: యానాంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని యానాం ఎస్పీ రఘునాయగం కోరారు. యానాం విష్ణాలయంవీధిలో సోమవారం నూతనంగా ఏర్పాటుచేసిన బ్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. బ్యాంక్ క్లస్టర్ హెడ్ దూరయ్‌స్వామి, బ్రాంచ్ మేనేజర్ డి.ప్రభాకర్‌రావు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ వెంకటప్రసాద్, క్యాషియర్ చిల్లా రాంబాబు, ప్రముఖ న్యాయవాది మాజేటీ నటరాజన్, సీఐ షణ్ముగం, ఎస్‌ఐ శేరు నూకరాజు పాల్గొన్నారు.